
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 28 । జూలై । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,000,పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.



సింగిల్ విండోకు పచ్చజెండా?

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. వివాహ పురోహితుల కొత్త విధానాన్ని ఆమోదించే వీలుంది. - 8లో ▸

హైపడైటిస్



సక్రమంగా లేని మన ఆహారపు అలవాట్లు ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతాయి. పలువురు మద్యం సేవిస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అటువంటి వారు లివర్ సమస్యల బారిన పడే అవకాశముంది. 8 లో

న్యూస్‌రీల్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన



వరద పరిస్థితులపై అధికారులను ఆరా తీస్తున్న ఎస్పీ శ్రీధర్

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ గురువారం పర్యటించారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద వరద పరిస్థితిని సమీక్షించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా రోప్ ఏర్పాటు చేయాలని ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులను అదేశించారు. ద్విచక్ర వాహనాలు కాజ్‌వే పై ప్రయాణం చేయకుండా అడ్డుకోవాలని సిబ్బందికి సూచించారు. వరద పరిస్థితులపై స్థానిక అధికారులను అరా తీశారు. ఆయన వెంట స్థానిక పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

జాబ్‌మేళాలో 34 మంది ఎంపిక

అమలాపురం రూరల్: ఉపాధి కల్పనా కార్యాలయం అమలాపురంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ సంస్థలకు 34 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంత లక్ష్మి తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో 10వ తరగతి నుంచి ఎంబీఏ వరకు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాన్నారు. ఎస్ఎస్ఆర్ఎల్‌టీఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, పేటీఎం సంస్థలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. 90 మంది పాల్గొన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులు అమలాపురం పరిసర ప్రాంతాలలో పనిచేసే సౌకర్యం ఉందన్నారు.

నేడు రాజోలు నియోజకవర్గంపై మంత్రి సమీక్ష

అమలాపురం రూరల్: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి జోగి రమేష్ శుక్రవారం కోనసీమ జిల్లాలో పర్యటిస్తారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అమలాపురం క్షత్రియ కల్యాణ మంటపంలో మార్కెట్ కమిటీ పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరవుతారు.


ప్రతాప్ సాహిత్య సేవలు ప్రశంసనీయం



ప్రతాప్‌ను సత్కరిస్తున్న కొమ్మినేని

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సాహిత్య సేవలు ప్రశంసనీయమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సాహిత్య కార్యక్రమంలో ప్రతాప్‌ను ఆయన సత్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో శ్రీశ్రీ కళావేదిక ద్వారా ప్రతాప్ సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకోవడం హర్షణీయమని కొమ్మినేని తెలిపారు. ప్రెస్ అకాడమీ సెక్రటరీ బాల గంగాధర్ తిలక్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇండియా రికార్డ్స్‌లో 'వేదాన్షి'కి స్థానం



రౌతులపూడి: మండలంలోని ములగపూడి గ్రామానికి చెందిన యామల గజ్జన్నదొర, వరలక్ష్మి దంపతుల రెండున్నరేళ్ల కుమార్తె 'వేదాన్షి'కి ఇండియా రికార్డ్స్–2023లో స్థానం లభించింది. ఈ విషయాన్ని చిన్నారి తండ్రి గజ్జన్నదొర గురువారం విలేకర్లకు తెలిపారు. అతి చిన్న వయస్సులో జంతువులు, పండ్లు, కూరగాయలు, వాహనాలు, రంగులు, ఆకారాలు, శరీర అవయవాలు వంటి 26 రకాల పేర్లను సులభంగా గుర్తించి, పలకడంతో ఆమెకు ఇండియా రికార్డ్స్‌లో స్థానం లభించినట్టు వివరించారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి అవార్డును కొరియర్ ద్వారా అందుకున్నట్లు తెలిపారు. ఇండియా రికార్డ్స్‌లో స్థానం సాధించిన వేదాన్షిని, ఆమె తల్లిదండ్రులను పలువురు అభినందించారు.



జి.పెదపూడి శివారు బూరుగులంక రేవులో వరద ఉధృతిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



ముక్తేశ్వరం–అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



బూరుగులంక రేవులో పడవ దాటి అమలాపురంలోని వివాహ వేదికకు వెళుతున్న వధువు

లంకల్లోకి నీళ్లు

- పోటెత్తుతున్న గోదావరి వరద
- లోతట్టు ప్రాంతాల్లోకి నీరు
- కాజ్‌వేల నీట మునక
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- గ్రామాల్లో వరదను పరిశీలించిన కలెక్టర్



అప్పనపల్లిలో ఇటుక బట్టీలను చుట్టుముట్టిన గోదావరి వరద

జిల్లాలో కంట్రోల్ రూం నంబర్లు

కలెక్టరేట్ : 18004252532
ఆర్డీవో ఆఫీస్ అమలాపురం : 08856233208, 8008803201
ఆర్డీవో ఆఫీస్ రామచంద్రపురం : 08857245166
ఆర్డీవో ఆఫీస్ కొత్తపేట : 9154983102

సాక్షి అమలాపురం: గోదావరి వరద మరోసారి పోటెత్తుతోంది. ఎగువన భద్రాచలంలో శాంతిస్తున్నా... దిగువన ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి రాను రాను పెరుగుతుండడంతో ఆ ప్రభావం జిల్లాపై పడింది. లోతట్టు ప్రాంతాల లంకల్లో వరద నీరు చేరుతోంది. పలు మండలాల్లో లంక గ్రామాలకు వెళ్లే కాజ్‌వేలు నీట మునిగాయి. వరద ఉధృతి శుక్రవారం జిల్లాపై మరింత పడనుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గురువారం ఉదయం ఆరు గంటలకు 10.02 లక్షల క్యూసెక్కుల వరద ఉండగా, ఎనిమిది గంటలకు 10.55 లక్షల క్యూసెక్కులకు, తొమ్మిది గంటలకు 10.97 లక్షలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 11.88 లక్షలకు, మూడు గంటలకు 12.24 లక్షలకు, సాయంత్రం ఆరు గంటలకు 12.90 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజీ వద్ద రాత్రి నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుంది. రెండో ప్రమాద హెచ్చరికను విడుదల చేశారు. భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గుతున్నప్పటికీ శబరి పోటెత్తుతుండడంతో కూనవరం వద్ద ఉధృతి తగ్గడం లేదు. ఈ ప్రభావం జిల్లాలోని లంక గ్రామాలపై పడింది. బ్యారేజీ వద్ద ఇంకా వరద ఉధృతి పెరుగుతుండడంతో జిల్లాలో శుక్రవారం వరద ముంపు తీవ్రత మరింత పెరగనుంది.

- జిల్లాలో వరద ఉధృతి పి.గన్నవరం మండలంపై అధికంగా ఉంది. ఇప్పటికే పది రోజులుగా నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంకలను గోదావరి మరింత చుట్టుముట్టింది. ఈ లంకలతోపాటు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయిలంక కాజ్‌వేపై వరద ఉధృతి మరింత పెరిగింది. బూరుగులంక రేవులో 20 మంది సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ప్రత్యేక బోట్ల ద్వారా వరద ఉధృతిని పరిశీలిస్తున్నారు. ఇక్కడ రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బోట్లతోపాటు ప్రయాణికులను తరలించేందుకు మూడు బోట్లు ఇప్పటికే సేవలందిస్తున్న విషయం తెలిసిందే. డొక్కా సీతమ్మ అక్విడెక్టు వద్ద వరద ఉధృతి అధికంగా ఉంది.
- మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై ముంపునీరు చేరింది. అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని తోటల్లో వరద నీరు చేరింది.
- ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక ఇరువైపులా ఉన్న మద్దూరు, ధవళేశ్వరం ఆర్మ్‌ల నుంచి సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న గోదావరి వరద స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.
- ఆలమూరు మండలం బడుగువానిలంక చుట్టూ వరద నీరు చేరింది. జొన్నాడ – రావులపాలెం మధ్య ఉన్న రెండు వంతెనల మధ్య నీటిఉధృతి కనిపిస్తోంది.
- ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, పల్లిగూడెంలో ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. రోడ్లు మునిగిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- అల్లవరం మండలం బోడసకుర్రు మత్స్యకార కాలనీలో వరద నీరు చేరింది. 45 ఇళ్లు నీట మునిగాయి. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

సాక్షి అమలాపురం: ఒకవైపు భారీ వర్షాలు... మరోవైపు గోదావరి వరదల వల్ల లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి అధికారులతో వర్షాలు, వరద స్థితిగతులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది వరద సహాయక చర్యల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరకుండా చూడాలన్నారు. గోదావరి తీర ప్రాంత పరిధిలోని ప్రతి గ్రామంలో రెండు వేల ఇసుక బస్తాలను ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగైదు గ్రామాలకు ఒక భోజనాన్ని సిద్ధం చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పునరావాస కేంద్రాల వద్ద నియమించిన సిబ్బంది, లంక గ్రామాలలో సహాయక చర్యలకు నియమించిన సిబ్బంది స్థానికంగా వరద ముప్పు తగ్గే వరకు ఉండాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు లంక గ్రామాలలో 104 సంచార వైద్య సేవలు నిత్యం కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యశాఖ అధికారులు 64 బోటు పాయింట్ల వద్ద అవసరమైన బోట్లు సిద్ధం చేయాలన్నారు. మొబైల్ రైతుబజార్లు నిర్వ హించాలన్నారు. లంక గ్రామాలలో కాజ్‌వేలు ఉన్నచోట్ల ఐరన్ రాడ్లతో సపోర్టింగ్ బారికేడింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

వరద ఉధృతి పెరుగుతుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జి.పెదపూడిలంక వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. గతంలో ఆయన ఇరిగేషన్ ఎస్ఈగా పనిచేసిన విషయం తెలుసుకుని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు గోదావరి వరద ఉధృతి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరదను కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర జి.పెదపూడిలంకలో పర్యటించారు.

పెళ్లి కుమార్తెకు వరద కష్టాలు

పి.గన్నవరం: గోదావరి వరదలు లంక గ్రామాల్లోని వివాహాలకు ఇబ్బందిగా మారాయి. పెళ్లి బృందాలు పడవలు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. గురువారం సాయంత్రం ఒక నవ వధువు పడవపై ప్రయాణించి వరుని ఇంటి వద్ద జరిగే వివాహ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో తరలివెళ్లింది. ఊడిమూడిలంకకు చెందిన తరపట్ల చిన్నారికి అమలాపురం సమీపంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన విప్పర్తి దుర్గాప్రసాద్‌తో శుక్రవారం ఉదయం వరుని ఇంటి వద్ద వివాహం జరుగనుంది. దీంతో వధువు చిన్నారిని కుటుంబ సభ్యులు బూరుగులంక రేవులో పడవ దాటించి తీసుకువెళ్లారు. అలాగే గురువారం ఊడిమూడిలంకలో మరొక వివాహం జరిగింది. అక్కడికి కూడా వధువును పడవ దాటించి లంకలోకి తీసుకువెళ్లారు.

'సురక్ష'తో సమస్యలకు మోక్షం



వెంకటాయపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాన్ని అందిస్తున్న మంత్రి వేణు తదితరులు

రామచంద్రపురం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకురావటంతో అద్భుతమైన స్పందన వస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో సర్పంచ్ వై.సతీష్‌కుమారి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి వేణు పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తమకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పొందడానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే వచ్చి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తూ పారదర్శకమైన పాలనను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎటువంటి రుసుములు తీసుకోకుండా దరఖాస్తు పెట్టుకున్న వెంటనే సచివాలయంలో అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. ఎంపీపీ అంబటి భవానీ, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్ఎంపీపీలు శాఖా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెన ఒక వరం



విద్యార్థులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు

అమలాపురం రూరల్: ప్రఖ్యాతి గాంచిన విదేశీ విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువుల కోసం సీట్లు పొందిన విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ఒక వరమని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన రెండో విడత నిధులను విద్యార్థులకు బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, పి.గన్నవరం ఎమ్మెల్యే కె.చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి వర్చువల్ విధానంలో వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులపై ఆసక్తి ఉన్న విద్యార్థులను అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది, ప్రపంచంతో పోటీ పడేలా ఈ పథకం చేస్తుందన్నారు. పీజీ, పీహెచ్, ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో మేలు కూరుతుందన్నారు. వార్షిక ఆదాయ పరిమితిని పెంచి ఆర్థికంగా వెనుకబడ్డ అగ్రవర్ణ పేదలకు కూడా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా సాయం చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రూ.కోటి 25 లక్షలు, మిగిలిన వారికి రూ. కోటి నిధులు కేటాయించిందన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు నాణ్యతతో కూడిన ఉన్నత చదువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 21 కేటగిరిలలో విదేశీ విద్యా దీవెన కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. విదేశాల్లో సీట్లు పొందిన పిల్లల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ఈ పథకం దోహద పడుతుందన్నారు. నాలుగు విడతలలో ఈ ఉపకార వేతనాలు చెల్లిస్తారని అన్నారు. కోనసీమ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హత సాధించారన్నారు. రాజోలుకు చెందిన జి.సంజయ్ అమెరికాలో ఎంటెక్ చేసేందుకు రూ.30,18,960కు అనుమతి పొందాడన్నారు. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన కొత్తపల్లి అనుదీప్ సివిల్ ఇంజినీరింగ్‌కు (అమెరికా) రూ. 50,43,054కు అనుమతి పొందాడన్నారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి జ్యోతిలక్ష్మిదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరు పాల్గొన్నారు.

తీరం ఇక నయన మనోహరం

అభివృద్ధి చేసే బీచ్‌లు

సాగర సంబరాల బీచ్ (బ్లూఫాగ్ బీచ్),ఎన్‌టీఆర్ బీచ్, నావెల్ డాక్‌యార్డు బీచ్, నేమాం బీచ్, హోప్ ఐలాండ్, దానవాయిపేట, గడ్డి పేట, అద్దరిపేట, పంపాదిపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, ఎల్లయ్యపేట, నర్సిపేట, తలపంటిపేట, కె.చోడిపల్లిపేట, కోనపాపపేట, కుంభాభిషేకం, పెరుమాళ్లపురం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్, ఉప్పాడ బీచ్, కోరంగి మడ అడవులు, యానాం బీచ్‌లు.

- బీచ్‌లపై పర్యాటక శాఖ ప్రత్యేక ఫోకస్
- మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- బ్లూఫాగ్ బీచ్‌గా కాకినాడ సాగర తీరం
- 21 తీర ప్రాంత బీచ్‌ల అభివృద్ధి



కాకినాడ బీచ్

పిఠాపురం: నీలి సముద్రం.. ఉప్పొంగే కెరటాలు.. ఇసుక తిన్నెలు.. అహ్లాదాన్నిచ్చే సాగర హోరుకు జిల్లాలోని సాగరతీర అందాలు పెట్టింది పేరు. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఇక్కడి తీర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్లుగా పేరొందాయి. సువిశాల సాగర తీర ప్రాంతాల అభివృద్ధిపై పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సాగర తీరం వెంబడి 22 బీచ్‌లను ఇందుకు ఎంపిక చేసుకుంది. పర్యాటకులను ఆకట్టుకునేలా వీటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా వడివడిగా చర్యలు చేపట్టింది. ఎక్కడెక్కడ బీచ్‌లు అభివృద్ధి చేయవచ్చో అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఫిషరీస్ యూనివర్శిటీ, పర్యాటక శాఖ, మత్స్యకార శాఖలతో కూడిన అధికార బృందం ఇందుకోసం రంగంలోకి దిగింది.

రుషికొండ తరహాలో..

పర్యాటకుల కోసం కాకినాడతోపాటు మరో 21 ప్రాంతాల్లో ప్రత్యేక బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. దేశంలో పది బ్లూ ఫాగ్ బీచ్‌లు ఉండగా మన రాష్ట్రంలో విశాఖ రుషికొండ ఇందులో స్థానం సాధించింది. కాకినాడలో కూడా అలాంటి బ్లూఫాగ్ బీచ్‌నే ఏర్పాటు చేయనున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో బీచ్‌లను సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్‌కు లోబడి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. దీంతో రానున్న రోజుల్లో కాకినాడ సాగర తీరం పర్యాటకులతో కళకళలాడనుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మరో గోవాను తలపించనుంది. బ్లూ ఫాగ్ బీచ్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టనున్నారు. బీచ్‌ల అభివృద్ధి వల్ల పరోక్షంగా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సేవల, పర్యాటక రంగం మరింత విస్తరించనుంది.


బ్లూఫాగ్ బీచ్‌లు అంటే ..

పర్యావరణానికి ప్రమాదం లేకుండా, స్నానాలకు అనువుగా ఉండే నీరు, ప్రాంతం ఉండేలా, బీచ్ నిర్వహణ, భద్రత, సేవలు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేస్తారు. 33 ప్రమాణాల ఆధారంగా ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సంస్థ బీచ్‌లను పరిశీలిస్తుంది. తర్వాత ధ్రువీకరించాల్సి ఉంటుంది. సందర్శకులకు అన్ని రకాల సేవలు సంతృప్తికరంగా ఉండేలా తగిన ప్రాంతాలను ఎంపిక చేసిన తర్వాత బ్లూఫాగ్ బీచ్‌లుగా గుర్తిస్తారు. ఆయా బీచ్‌లలో అక్కడి విశేషాలను వివరించడానికి సిబ్బందిని నియమిస్తారు.

పర్యాటక బీచ్‌లు

కాకినాడ నుంచి తుని సమీపంలో అద్దరిపేట వరకు ఉన్న సాగరతీరం మనోహరంగా ఉంటుంది. కాకినాడ బీచ్ పార్కు, తీరం వెంబడి రోడ్డు, అద్దరిపేట వద్ద సాగరతీరం, పంపు హౌస్‌లు పిక్నిక్ స్పాట్‌లుగా వెలుగొందుతున్నాయి. కాకినాడ సమీపంలో హోప్ ఐలాండ్ సముద్ర మధ్యలో సహజంగా ఏర్పడిన ద్వీపం. ప్రస్తుతం ఇది మంచి పిక్నిక్ స్పాట్‌గా మారింది. కాకినాడ హార్బర్, కోరంగి మడ అడవుల నుంచి ఇక్కడకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు ఉన్నాయి. కోరంగి మడ అడవులు– కాకినాడ సమీపంలో తాళ్లరేవు మండలంలోని మడ అడవులు పచ్చని చెట్లతో చూపరులను కట్టిపడేస్తుంటాయి. కడలి కెరటాలు, పచ్చని చెట్లు, ఇసుక తిన్నెల మధ్యలో కాలువలు, సముద్ర దీవులను తలపిస్తుంటాయి. వీటిని అభివృద్ధి చేయడంతో పాటు కొన్ని ప్రాంతాలకు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు.

అనుమతులు రావడమే తరువాయి



పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా కాకినాడ సాగర సంబరాల బీచ్‌ను బ్లూ ఫాగ్ బీచ్‌గా అభివృద్ధి చేయనున్నాం. మరో 21 ప్రాంతాల్లో బీచ్‌లను అభివృద్ధి చేస్తాం. ప్రతిపాదనలు పూర్తయ్యాయి. అనుమతులు రావల్సి ఉంది. ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంది.

– పమ్మిపులేటి పోచయ్య, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖాధికారి

లక్ష్యసాధనపై ప్రత్యేక శ్రద్ధ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

అమలాపురం రూరల్: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు సూచించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఆడుదాం– ఆంధ్ర, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, పాఠశాల విద్య జగనన్న సురక్ష, అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం డీఆర్‌ఓ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి వసతులను స్థానిక ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చి సుపరిపాలన అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. స్టేజ్ కన్వర్షన్ ద్వారా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేసి అధికారులకు అప్పగించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అక్టోబర్ 2న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. 46 రోజుల పాటు ఐదు క్రీడలలో ఐదు స్థాయిలలో పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, డ్రిల్ మాస్టర్ల సహాయం తీసుకోవాలన్నారు. విజేతలను అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేయనున్నారు.


క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సూర్యనారాయణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద సాయిబాబా ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు తెలిపారు. ఉండూరుకు చెందిన కొప్పిశెట్టి సూర్యనారాయణ(60) , కుడిపూడి సత్యనారాయణ ద్విచక్రవాహనంపై కూలిపనికి వెళుతుండగా ద్రాక్షారామ వైపు వస్తున్న బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఘటనలో వెనుక వైపున కూర్చుని ఉన్న సూర్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వాహనం నడుపుతున్న సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా వారిలో ఒక కుమార్తె చిన్న వయసులోనే మృతి చెందింది. ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి వివాహాలు అయ్యాయి. ఇటీవల దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఫించన్ ఈ నెలలో అందుకోవాల్సి ఉంది. కానీ అందుకోకుండానే తనువు చాలించడంటూ కుటుంబీకులు విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్సై భుజంగరావు తెలిపారు.

హెపటైటిస్



- వ్యాధి సోకితే ప్రాణాంతకం
- ముందస్తు వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట
- నేడు ప్రపంచ హెపటైటిస్ డే

రాయవరం: సక్రమంగా లేని మన ఆహారపు అలవాట్లు ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతాయి. పలువురు మద్యం సేవిస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అటువంటి వారు లివర్ సమస్యల బారిన పడే అవకాశముంది. ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్–బి, హైపటైటిస్–సి వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 354 మిలియన్ల వరకు ఉంది. ప్రతీ రోజు ప్రపంచవ్యాప్తగా 3,000 మంది మృత్యువాత పడుతున్నారు. వ్యాధి సోకిన వారిలో 90 శాతం మందికి చికిత్సలపై అవగాహన లేదు. దీంతో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2010 జూలై 28న హెపటైటిస్ డేను నిర్వహించాలని నిర్ణయించింది. 2030 నాటికి హెపటైటిస్ లేని ప్రపంచాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలివే..

- కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది.
- కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపుపచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చ కామెర్లు అంటారు.
- వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించి వాంతులవుతాయి.
- వ్యాధి సోకిన వారు బాగా బలహీనపడతారు. కీళ్ల నొప్పులు ఉంటాయి.
- కొంతమంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. పొట్ట బాగా ఉబ్బుతుంది. కాలేయం సరిగ్గా పనిచేయక మృత్యువుకు దారి తీస్తుంది.

సోకుతుందిలా..

వ్యాధి సోకిన వ్యక్తి నుంచి స్రవించే ద్రవాలు, మూత్రం, వీర్యం వ్యాధి సోకడానికి కారణమవుతుంది. సురక్షితం కాని సంభోగం, ఒకరు వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడడం, టాటూలు వేయించుకోవడం, ముక్కు, చెవులు కుట్టుకోవడం, ఒక రేజర్, బ్లేడ్‌ను అనేకమంది వాడడం. ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడడం, సురక్షితం కాని రక్తదానం వంటి వాటి వల్ల వ్యాధి సోకుతుంది. వైరస్ సోకిన గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు వ్యాధి సంక్రమిస్తుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మోడల్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల ద్వారా హెబీఎస్ఏజీ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి వైద్యం అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రత్యేక సదుపాయాలతో ప్రసూతి వైద్యం అందిస్తున్నారు. 2022–23 సంవత్సరంలో ఎనిమిది గర్భిణులకు నిర్వహించిన పరీక్షల్లో హెపటైటిస్ పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఐదుగురికి మోడల్ సెంటర్లలో ప్రభుత్వ వైద్యులు పర్యవేక్షణలో డెలివరీ చేశారు. 2023–24 సంవత్సరాల్లో కొత్తగా ఐదు కేసులు నమోదయ్యాయి.

ప్రాణాంతకం

హెపటైటిస్ వ్యాధి కాలేయానికి సంబంధించినది. హెపడ్నా వైరిడియా ఫ్యామిలీ ద్వారా సోకుతుంది. వైరస్ ఒకసారి శరీరంలోకి వస్తే క్రమేపీ వాటి సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. ఇందులో ఎ,బి,సి,డి,ఈ రకాలు ఉన్నప్పటికీ వాటిలో బీ,సీ ప్రాణాంతకంగా వైద్యులు చెబుతున్నారు. వ్యాధి సోకిన వారిలో ఏ విధమైన లక్షణాలు కన్పించకపోవడంతో వారి ద్వారా ఇతరులకు సోకుతుంది. వయసుతో సంబంధం లేకుండా అందరికీ సోకుతుంది. హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష ద్వారా వ్యాధి సోకిందా? లేదా? అనేది నిర్ధారణ చేస్తారు.

వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చు



హెపటైటిస్–బి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. హెపటైటిస్–సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు. ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేసుకోవచ్చు.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అమలాపురం

ముందు జాగ్రత్తలే మేలు



వ్యాధి వచ్చిన తర్వాత బాధపడడం కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ఈ వ్యాధి బారిన పడితే లివర్ క్యాన్సర్ కూడా వచ్చే అవకాశముంది. కామెర్లు వ్యాధి సోకినవారు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. శరీరంలో వైరస్ ఆరు నెలలకు మించి ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారి తీసి, కొన్నేళ్ల తర్వాత లివర్ దెబ్బతినడానికి కారణమవుతుంది. క్రానిక్ డిసీజ్ ఉన్న వారి నుంచి ఎక్కువగా ఇతరులకు వ్యాపిస్తుంది.

– డాక్టర్ కె.కార్తీక్, సివిల్ సర్జన్, ఎండీ జనరల్ మెడిసిన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

రూ.4.7లక్షల విలువైన ఐదు వాహనాలు స్వాధీనం


పట్టుబడిన మోటారు సైకిళ్లతో సీఐ మురళీకృష్ణ, సర్పవరం స్టేషన్ సిబ్బంది

కాకినాడ రూరల్: చెడు వ్యసనాలకు బానిసగా మారి సులభంగా డబ్బు సంపాదించాలని మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామం సింహాద్రినగర్‌కు చెందిన నరాల లక్ష్మణరావును గురువారం అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ మీడియాకు తెలియజేశారు. నిందితుడి నుంచి రూ.4.70 లక్షల విలువైన ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలోని డిమార్టు వద్ద రెండు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ వద్ద రెండు, ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద ఒక మోటారు సైకిల్ చోరీ కాగా నిందితుడు నరాల లక్ష్మణరావును అతడి ఇంటి వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుడిని స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరచగా 15రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌ను మెజిస్ట్రేట్ విధించారని సీఐ తెలిపారు. కేసును ఛేదించడంలో సహకరించిన హెచ్‌సీ సత్యనారాయణ, గణేష్, పీసీ వెంకటరత్నం, సతీష్‌కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

సింగిల్ విండోకు పచ్చజెండా?

- వివాహ పురోహితుల కొత్త విధానంపై నిర్ణయించే అవకాశం
- నేడు అన్నవరం దేవస్థానం పాలకవర్గ సమావేశం


అన్నవరం దేవస్థానం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం పాలకవర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో ట్రస్టిబోర్డు సభ్యులతో బాటు ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఇతర అధికారులు పాల్గొంటారు. ఈసారి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

వివాహ పురోహితుల వేలం రద్దుకు ఆమోదం

ప్రధానంగా ఇటీవల కాలంలో వివాదాస్పదమైన వివాహ పురోహితుల సంభావన హక్కు వేలంపాటను రద్దు చేస్తూ దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రతిపాదించే తీర్మానానికి పాలకమండలి ఆమోదం తెలపనుంది. దాని స్థానంలో కొత్త విధానంపై చర్చించనున్నారు. సింగిల్ విండో పద్ధతిని అమలు చేస్తూ అటు వివాహాలు చేయించే పురోహితులు, పెళ్లి బృందాల ఇంటి పురోహితులు, దేవస్థానంలో పనిచేస్తున్న వ్రత పురోహితులకు వివాహాలు చేయించే అవకాశం కల్పించనున్నారు. ఇందుకోసం వివాహానికి విద్యుత్, క్లీనింగ్ చార్జీల కోసం కొంత మొత్తం పెళ్లి బృందాలు చెల్లించేలా నిర్ణయించనున్నట్లు సమాచారం.

- పురోహితుల కొత్త విధానానికి సంబంధించిన విధివిధానాలు తెలిపే బోర్డులను దేవస్థానంలో పలుచోట్ల ఏర్పాటు చేయనున్నారు.
- వచ్చే నెల 18వ తేదీన సత్య విదియ (సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం) సందర్భంగా చేయవల్సిన ఏర్పాట్లపై కూడా చర్చించనున్నారు.
- ప్రతీ గురువారం మధ్యాహ్నం వరకు 'సత్యదేవుని నిజరూపు' పేరుతో ఎటువంటి అలంకరణ లేని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి శిలామూర్తులను భక్తులు తిలకించే విధంగా ఏర్పాటు చేసే కొత్త విధానంపై ట్రస్ట్‌బోర్డులో చర్చించనున్నారు.
- జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయంలో శిలా మూర్తులకు బదులు తాత్కాలికంగా సిమెంట్ విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తులకు దర్శనం కలిగించేలా తీసుకున్న నిర్ణయంపై చర్చించనున్నారు.
- ఉత్తరాయణంలో అంటే వచ్చే జనవరి అనంతరం ఆలయంలో శిలామూర్తులను ప్రతిష్ఠించి కుంభాభిషేకం నిర్వహించే అంశంపై కూడా చర్చించనున్నారు. ఆలయం సమీపంలో వంటశాల నిర్మించి త్రికాల నివేదనలు తయారు చేసే విషయమై చర్చించనున్నారు.
- వ్రత మంటపాలలో వృద్ధులు, వికలాంగులు వ్రతాలాచరించే సమయంలో ఎక్కువ సేపు నేల మీద కూర్చోలేక పోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్రత మంటపాలలో ఒక వరుస టేబుల్స్, బెంచీలు ఏర్పాటు చేసే విషయమై చర్చించనున్నారు.
- సత్యదేవుని చిత్రం ముద్రించిన శాలువాల కొనుగోలు, భక్తులకు సత్యదేవుని కండువాలు విక్రయించే విషయమై కూడా చర్చించనున్నారు.
- దేవస్థానంలో పలు నిర్మాణ పథకాలకు టెండర్ల ఆమోదంపై కూడా చర్చించనున్నారు.

'వందేభారత్'కు సామర్లకోటలో హాల్ట్

రైల్వే మంత్రికి ఎంపీ గీత విజ్ఞప్తి


రైల్వే మంత్రి అశ్వనివైష్ణవ్‌కు వినతిపత్రమిస్తున్న ఎంపీ గీత

సాక్షిప్రతినిధి, కాకినాడ: వందేభారత్ రైలుకు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనివైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ వంగా గీత విజ్ఞప్తి చేశారు.గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి జిల్లాలో పలు పెండింగ్ అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాజమహేంద్రవరం, విశాఖపట్నం మధ్య సామర్లకోటలో వందేభారత్‌కు హాల్ట్ ఇప్పిస్తే ప్రయాణికుల సంఖ్య ఇంతకు రెట్టింపు అవుతుందన్నారు. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఈ హాల్ట్ ఇప్పించాలని కోరారు. సామర్లకోట రైల్వే జంక్షన్ మీదుగా నడిచే ముఖ్యమైన రైళ్లకు తుని, అన్నవరం, గొల్లప్రోలు, పిఠాపురం, రావికంపాడులో స్టాప్ ఇవ్వాలని ఈ మేరకు లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. ఫాస్ట్ పాసింజర్ రైలు డౌన్‌లో మాత్రమే ఆపుతూ, అప్‌లో ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇటీవల రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ.40 కోట్లు విడుదల చేసి పనులు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు పూర్తి అయ్యేటట్టు చూడాలన్నారు. రైళ్లలో సీనియర్ సిటిజన్స్, జర్నలిస్టులకు రాయితీలు కల్పించాలని ఎంపీ కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మహిళల కోసం జనరల్ బోగీలు పెంచాలని, కోవిడ్‌లో నిలిపివేసిన పాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలన్నారు. అన్నవరం నుంచి కాకినాడ సెజ్ వరకు ఏర్పాటు చేస్తోన్న పోర్టు రైల్వే లైన్ నిర్మాణాన్ని కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్ వరకు విస్తరించాలని గీత విజ్ఞప్తి చేశారు. కాకినాడ నగరం నుంచి వ్యాపార, వాణిజ్య వర్గాలకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు.


ముగిసిన వర్క్‌షాపు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ, డీఏపీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్, ఆప్‌స్కిల్స్ సంస్థ సహకారంతో డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ –లెవరేజింగ్ పైథాన్ టెక్నాలజీ ప్రాక్టికల్ అప్రోచ్ అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాపు 3వ రోజు గురువారం ముగిసింది. జేఎన్‌టీయూ హైదరాబాద్ వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయ్యంకి మురళీకృష్ణ పవర్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై ప్రసంగించారు. మేధాశక్తితో ఆలోచించడం ద్వారా వినూత్నమైన పరిశోధనలు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు సులువుగా చేపట్టవచ్చన్నారు. మెషిన్ లెర్నింగ్ కాలక్రమేణా అన్వేషణాత్మక పరిశోధన నిర్వహిస్తుందన్నారు. అనంతరం వర్సిటీ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ గోపాలకృష్ణ, డీఏపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వర్క్‌షాపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

అట్టహాసంగా క్లస్టర్ గేమ్స్

పెద్దాపురం నవోదయలో ప్రారంభం


జ్యోతి వెలిగించి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రామిరెడ్డి


నవోదయలో హోరాహోరీగా జరుగుతున్న క్రీడాపోటీలు

పెద్దాపురం: ప్రతీ విద్యార్థికి క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని పెద్దాపురం ఐటీబీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎన్.నరేంద్రనాథ్, పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించే క్లస్టర్ స్థాయి బాల్‌గేమ్స్ పోటీలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాలయ పీఈటీ ఆర్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన క్రీడా పోటీలనుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని కనపర్చాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్ (వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్) క్రీడా పోటీలు నిర్వహించగా నవోదయ తూర్పుగోదావరి 1,2తో పాటు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ కేంద్రాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.